

నేడు జిల్లా స్థాయి చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతీ సంవత్సరం జన విజ్ఞాన వేదిక విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంచే విధంగా చెకుముకి సంబరాలు నిర్వహిస్తోంది. ఈసారి కూడా రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సంబరాల్లో భాగంగా గత రెండు నెలల్లో స్కూల్, మండల స్థాయి పరీక్షలు నిర్వహించారు. సైన్స్ టీచర్లకు, ఉచిత సైన్స్ కిట్లు పంపిణీ లాంటి కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహణ స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో జరుగుతుందని జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష లో మండల, పట్టణ స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాలని కోరారు. విద్యార్థులకు ధ్రువ పత్రాలతో పాటు విశ్వ విజ్ఞానానికి సంభదించిన పుస్తకాలు బహుమతులుగా ఇస్తామని తెలిపారు.

వసతిగృహాల్లో సంక్షేమమేదీ?

పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలు నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చాలీచాలని వసతితో ఇరుకు గదులు, సరపడా మరుగుదొడ్లు , బాత్‌రూములు లేకపోవడం, వర్షం వస్తే కారిపోయే భవనాలు నగరంలో దర్శనమిస్తున్నాయి. అసలే చలికాలం కావడంతో కప్పకునేందుకు దుప్పట్లు సైతం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కనీస సౌకర్యాల్లేని ఎస్‌సి వసతిగృహం

- **అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్న వైనం**
- **తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**
- **శాశ్వత భవనాలకు నోచని బిసి వసతి గృహం**

బిసి వసతిగృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి-విజయగనరంటౌన్

జిల్లా కేంద్రంలో ఒకప్పుడు నాలుగు సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉండగా, నేడు కేవలం ఒకే ఒక్క హాస్టల్ ఉంది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన వసతి గృహం నేడు కేవలం 50 మందితో మాత్రమే నడుస్తోంది. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు ఉన్నత మైన ఉద్యోగాల్లో స్థిరపడిన వారున్నారు. అటువంటి వసతిగృహాలు నేడు ధీనావస్థలో ఉన్నాయి. కాటవీధిలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహం స్లాబు పెచ్చులు ఊడిపోయి ఎప్పుడు ఎవరి మీద పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. హాస్టల్‌లో 50 మంది విద్యార్థులుంటే బాత్ రూములు, మరుగుదొడ్లు ఆరేసి చొప్పున ఉన్నాయి. వాటిలో రెండు బాత్ రూములు, మరుగుదొడ్ల పని చేయడం లేదు. ఉన్న వాటితోనే విద్యార్థులు గంటల కొద్ది వేచి ఉండి పాఠశాలకు సిద్ధమవ్వాల్సిన పరిస్థితి. మరోవైపు జిల్లా కేంద్రంలోనే బిసి బాలుర, బాలికల వసతి గృహాలు నడుస్తున్నాయి.

పాత రాజ్యలక్ష్మి సినిమా హాలు ఎదురుగా ఉన్న వసతి గృహం అద్దె భవనంలో నడుస్తుంది. కాట వీధిలో వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో నెలకు రూ.30వేలు అద్దె ప్రాతిపదికన నడుస్తున్నది. ఇందులో 59 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి రెండేసి మరుగుదొడ్లు, ఒక్కో బాత్‌రూము ఉన్నాయి. మరోవైపు రూములు చిన్నవి కావడంతో విద్యార్థులు ఇరుకుగా నిద్రపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు కమాటినే కుక్‌గా మారి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు. కమాటి, అటెండర్‌తో వసతి గృహం నిర్వహణ, వంటలు శుభ్రం చేయడం వంటి పనులు చేయిస్తున్నారు. కుక్ లేకపోవడంతో కమాటి ఆపని చేసి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు.

కాటవీధిలో గల పాత బిసి వసతి గృహం చివరకు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. మందు బాబులు, గంజాయి తాగే వారు ఆ భవనంలోకి వెళ్లడంతో ఆ పక్కనే ఉన్న ఎస్‌సి వసతి గృహ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన చెందుతున్నారు.

విటి అగ్రహారం బిసి కాలనీలోగల బాలికల వసతి గృహంలో 60 మంది వరకు విద్యార్థులున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వసతి గృహాలను అభివృద్ధి చేయకపోవడంతో రోజురోజుకూ సమస్యల సుడిగండంలో నడుస్తున్నాయి. గిరిజన బాలికలు వసతి గృహం కూడా పాతభవనం కావడంతో వర్షం వస్తే కారిపోతోంది.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శాశ్వత భవనాలు, వసతులు కల్పించకపోతే రానున్న కాలంలో ఉన్న వసతి గృహాల్లో కూడా విద్యార్థులు చేరే అవకాశం కనిపించడం లేదు. చివరకు వాటిని మూసేసే పరిస్థితులు దాపురించనున్నాయి. మౌలిక వసతులు, శాశ్వత భవనాలు, సౌకర్యాలు కల్పించి విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులూడిపోతున్న ఎస్‌సి వసతిగృహం

బొబ్బిలి.. పొలంలో వేసిన వరికుప్పలు

అన్నదాతలో అలజడి

ప్రజాశక్తి - వీరఘట్టం

మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లా అంతటా స్వల్ప వర్షం పడడంతో అన్నదాతలో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టించి సాగు చేసినప్పటికీవరి పంట చేతికందివచ్చిన తరుణంలో వాతావరణంలో ఒకసారి మార్పు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పరుగులు పెడుతున్నారు. హడావుడిగా కుప్పలు పెట్టగా, మరికొన్ని చోట్ల పొలాల్లోనే కోసి వుంచిన వరిచేలు అక్కడే ఉండిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి పడుతున్న జల్లులతో తడిచిపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చలివేంద్రి, బూరుగ తదితర గ్రామాల్లో యంత్రాల ద్వారా వరి పంటను నూర్చుకుంటున్నారు. కొనుగోలు లేకపోవడంతో ఎక్కడ ధాన్యం అక్కడే కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు వరికుప్పలు తడవకుండా ఉండేందుకు వాటిపై బరకాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కల్లాల వద్ద పంటను విక్రయించేందుకు పడిగాపులు కాస్తున్నారు.

వీరఘట్టం.. ధాన్యం పాడవకుండా ఉండేందుకు కప్పిన టార్పాలిన్లు

తడిసిన వరికుప్పలు

బొబ్బిలి : అల్పపీడన ప్రభావంతో కురిసిన చిరుజల్లులతో పొలాల్లోని వరిచేలు తడిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో చలి తీవ్రత పెరిగింది. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరికుప్పలు లోపలకు వర్షపు నీరు దిగితే కంకెలు మొలకెత్తే అవకాశం అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలమాంబ ఆలయ ఇఒగా రాధాకృష్ణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా వాకర్ల రాధాకృష్ణను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొండ ఆలయాల కార్యనిర్వహణాధికారిగా ఈయన పనిచేస్తున్నారు. ప్రస్తుత పోలమాంబ అమ్మవారి జాతర పూర్తయ్యే వరకూ రాధాకృష్ణ ఇఒగా కొనసాగుతారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ప్రజా రంజక పాలన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం నగరంలోని నాగవంశపు వీధి జంక్షన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. టిడిపి చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కానరాలేదని అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి , ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. తన వెనుక ఉన్నది కార్యకర్తలేనని, పార్టీకి కార్యకర్తలు వెన్నెముక లాంటి వారని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నియమావళి, కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై ముద్రించిన పుస్తకాలను పార్టీ నాయకులకు అందజేశారు.

జోనల్ ఇన్‌ఛార్జి కంటుభుక్త తవిటిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జోనల్ ఇంఛార్జి కాళ్ల సూరిబాబు, పార్టీ నాయకులు సుంకర సత్యారావు, రాష్ట్ర నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కర్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

12న బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 12న తెన్నుబొడ్డవరలో అండర్-14 ,17, 19 ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ బాలుర, బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి పొట్నూరు శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2004 జనవరి ఒకటో తేది తరువాత జన్మించాలని చెప్పారు. స్టడీ, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్సులను తీసుకురావాలని సూచించారు. వివరాలకు 7989199534ను సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో ఉన్న పాడి పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాలు చేపడుతోంది. కానీ వంగర మండలంలో మాత్రం వైద్యాధికారులు లేకపోవడంతో సరైన వైద్యం సకాలంలో అందక పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. మండలంలో ఇద్దరు పశు వైద్యాధికారులు ఉండాల్సి ఉన్నా గత కొంతకాలంగా వైద్యులు లేకపోవడంతో వంగర పశు వైద్య కేంద్రం మూతపడింది. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తాళం వేసి ఉన్న వంగర పశు వైద్య కేంద్రం

మూగ రోదన

- **పశువులకు అందని వైద్యం**
- **మృత్యువాత పడుతున్న మూగజీవాలు**
- **ఆందోళనలో పాడి రైతులు**
- **పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి- వంగర

మండలంలోని 29 పంచాయల్లో అధికారిక లెక్కలు ప్రకారం 10,412 ఆవులు, 172 గేదెలు, 11,535 గొర్రెలు, 5,956 మేకలు ఉన్నాయి. వీటన్నింటికీ వైద్యం అందించేందుకు వంగర, రాజులగుమ్మడలో రెండు పశువైద్య కేంద్రాలను గతంలోనే ఏర్పాటు చేశారు. ఇందులో ఒక్కో కేంద్రంలో ఒక వైద్యునితోపాటు వెటర్నరీ అసిస్టెంట్, సబార్డినేట్ ఉండాలి. కానీ వంగరలో వైద్యులతో సహ సిబ్బంది కూడా లేకపోవడంతో అక్కడ ఉన్న పశువైద్య కేంద్రం మూతపడింది. రాజులగుమ్మడలో ఒక అసిస్టెంట్ తప్ప వైద్యుడు గాని, సిబ్బంది గాని లేకపోవడం వల్ల పశువైద్యం అంతంత మాత్రంగానే ఉంది. సచివాలయాల్లో అక్కడక్కడ సిబ్బంది ఉన్నప్పటికీ పశువ్యాధులకు మందులు ఇవ్వడం తప్ప పెద్ద వ్యాధులకు నయం చేసే పరిస్థితి లేదు.

మృతి చెందుతున్న ఆవులు

వైద్యులు అందుబాటులో లేక సకాలంలో వైద్యం అందకపోవడంతో అనారోగ్యానికి గురైన పశువులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికే శివ్వాంలో కొవగాన తవిటి నాయుడు, బలగ అప్పలనాయుడు, బలగ సూర్యనారాయణ, బమ్మిడి శంకరరావుకు చెందిన ఆవులు, వంగరలో ఇనమల సింహాద్రి నాయుడు, దేవకివాడ అప్పలనాయుడుకు చెందిన ఆవులు, మద్దివలసలో ఉత్తరావల్లి అర్జున్, ఉత్తరావల్లి పెద్ద సింహాచలం, ఓని అగ్రహారంలో మజ్జి శ్రీనివాసరావుకు చెందిన ఆవు ఇటీవల వ్యాధుల బారిన పడి సకాలంలో సరైన వైద్యం అందక మృతి చెందాయి. ఇలా చెప్పుకుంటూపోతే మండలంలో చాలా గ్రామాల్లో పశు వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

కానరాని ఇన్‌ఛార్జి డాక్టర్

సంతకవిటి మండలం గుల్ల సీతారాంపురంలో వైద్యులుగా పనిచేస్తున్న ఒకరిని వంగర పశువైద్య కేంద్రానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన వంగరలో విధులు నిర్వహించిన పరిస్థితి ఎన్నడూ కనబడలేదు. దీంతో పశు వైద్యం అందడం లేదని పాడి రైతులు వాపోతున్నారు.

వైద్యం అందక దూడ మృతి

ప్రస్తుతం చాలా పశువులు వ్యాధులు బారినపడి చనిపోతున్నాయి. వైద్యాధికారులు అందుబాటులో లేనందువల్ల సరైన వైద్యం అందక మా ఆవు దూడ మృతి చెందింది.

- బలగ సూర్యనారాయణ, శివ్వాం

రెండేళ్లుగా పెండింగ్‌లోనే క్లెయిమ్‌లు

ఇన్స్యూరెన్స్ చేయించిన పాడి పశువులు మృతి చెందినప్పుడు పశువైద్యాధికారులకు తెలియజేస్తే వారొచ్చి పోస్టుమార్టం నిర్వహించి ప్రభుత్వం నుంచి బీమా వర్తించేలా చేస్తారు. మండలంలో ఈ రెండేళ్ల కాలంలో 116 మంది పాడి రైతులు దరఖాస్తు చేస్తే ఇప్పటివరకు ఒక్క దానికీ కూడా బీమా డబ్బులు ఇవ్వలేదు. దీన్నిబట్టి పశు వైద్యాధికారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో చాలా మంది పాడి రైతులు ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల వచ్చిన లంపిస్కిన్ వ్యాధితో కూడా చాలా ఆవులు మృతి చెందినా వైద్యం అందించడానికి సిబ్బంది, వైద్యులు రాకపోవడంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు

ఇటీవల రూ. 25 వేలు విలువ చేసే నా ఆవు మృతి చెందింది. ఇప్పటికీ ఎవరూ పట్టించుకో లేదు. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

- ఇనమల సింహాద్రి నాయుడు, వంగర

1962 కాల్ చేయండి

వంగరకు ఇన్‌ఛార్జి వైద్యులున్నారు. అత్యవసరమైతే అక్కడకు వస్తున్నారు. వంగర దూరంగా ఉండటం వల్ల ఎక్కువగా ఆయన రాలేకపోతున్నారు. అత్యవసరమైతే 1962 కాల్ చేస్తే మొబైల్ వ్యాన్ వస్తుంది.

- సత్యప్రకాశ్, పశుసంవర్ధక శాఖ ఎడి

వంగరలో మృతి చెందిన ఆవు

అన్నదాతపై అలక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మాటలు కోటలు దాటుతున్నా అచరణ గడప దాటడం లేదట! ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలకు, ఆచరణకు అచ్చంగా ఈ తెలుగు సామెత అర్థం పడుతుంది. ధాన్యం కొనుగోలు విషయమై అధికార యంత్రాంగం చెప్పిన మాటలు ఇంపూ తెంపూ లేవు. ఈ ఏడాది ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇందుకోసం ఈ ఏడాది ఆర్‌బికెల అనుసంధానంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ల విధానం ప్రవేశపెట్టామని దాదాపు నెలరోజులుగా సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి మరీ ఊదరగొట్టారు. గోనెసంచులు కూడా అందుబాటులోకి తెస్తామని, లోండింగ్, అన్‌లోడింగ్ విషయంలో హమాలీలకు ప్రభుత్వం తరపునే ఛార్జీలు చెల్లిస్తామని, రవాణా ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని కూడా నొక్కి వక్కానించారు. అంతటితో ఆగలేదు. ఎప్పటి మాదిరిగా రైతులు దళారులు, మిల్లర్ల భారిన పడకుండా బిల్లులు కూడా ఆర్‌బికెల ద్వారానే తీస్తామని చెప్పారు. అంతా బాగానే ఉన్నా చెప్పిన మాటలు ఆచరణలో కనిపించడం లేదు. ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా కొనుగోలులోనే జాప్యం జరుగుతుండడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. విజయనగరం జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, పార్వతీపురం మన్యం జిల్లాలో 3.30లక్షల

మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ, ఆచరణలో అందుకు తగ్గట్టు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండడమే ఇందుకు తార్కాణం. వరి కోతలు, నూర్పులు ప్రారంభమై సుమారు పక్షం రోజులు దాటుతోంది. ఇప్పటికీ విజయనగరం జిల్లాలో 2,500క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే పరిస్థితి. గొనె సంచులు ఈ రెండు జిల్లాలకు తగినన్ని రాలేదు. రూ.10 నుంచి రూ.12 విలువగల సంచులకు రూ.3.90 చెల్లిస్తామని చెప్పడంపై సర్వత్రా నిరసన వ్యక్తమౌతోంది. ఇలాన్నీ అన్ని విషయాల్లోనూ వెనుకబాటు తప్పకపోవడంతో ఈనెల 6న రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 16న ఏకంగా ధర్నా చేపట్టేందుకు రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. విజయనగరం జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకుంది. రైతులు నిరసనలకు సిద్ధమౌతున్నారు. అకాల వర్షాలు వెంటాడుతున్న నేపథ్యంలో ధాన్యం మొలకొత్తే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో వెంటవెంటనే ధాన్యం కొనుగోలు చేసి, చెల్లింపులు కూడా 24గంటల్లోపు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎప్పుడో కేంద్రం చెల్లించే వరకు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం అన్నదాతపై అలక్ష్యం వీడీ ఆదుకునే దిశగా కదలాలని రైతులతా కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు కోరారు. శనివారం మండలంలోని గుషిని, మొయిద, సతివాడ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుషిని, మొయిద రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆనంతరం ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్మడానికి దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ధాన్యం అమ్మిన 21 రోజుల్లో రైతుల ఖాతాలో నగదు జమచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములునాయుడు, డిసిసిబి వైస్‌చైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు గుషిని సర్పంచ్ జమ్ము సన్యాసమ్మ, ఎంపిటిసి చనమల్ల స్వాతి, మొయిద, సతివాడ సర్పంచులు అట్టాడ కృష్ణ, రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.గిరిబాల, తహశీల్దారు కె.వి.రమణరాజు, ఎఒ ఎం.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

12, 13 తేదీల్లో చలో ఐటిడిఎ

పార్వతీపురం : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 12,13 తేదీల్లో చలో ఐటిడిఎ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. గిరిజన విద్యారంగం ఉపాధ్యాయ సమస్యలపై అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోలేదని, ఈ సందర్భంగా అన్ని ఐటిడిఎల్లో జీపుజాతా నిర్వహించి సమస్యలను సేకరించి పాడేరులో రాష్ట్ర సదస్సు నిర్వహించామన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. వీటి పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 12న సీతంపేట, 13న పార్వతీపురం ఐటిడిఎల వద్ద చలో ఐటిడిఎ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, సిఆర్‌టిలను రెగ్యులరైజ్ చేయాలని, ఎంఇఒ పోస్టులను ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

హమాలీ రేట్లు పెంచకపోతే 16 నుంచి సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం కలెక్టరేట్

పార్వతీపురం ప్రాంతంలోని రైస్‌మిల్ కళాసీలకు నూతన హమాలీ రేట్లు ఒప్పందం వెంటనే చేయాలని, లేనిచో ఈనెల16 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పార్వతీపురం రైస్ మిల్ కళాసీ యూనియన్ నాయకులు కృష్ణ అధ్యక్షతన యూనియన్ విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు జరుగు ఈ ఒప్పందం ఈ ఏడాది మే నాటితో ముగిసిందన్నారు. కొత్త డిమాండ్ల నోటీసు అప్పుడే ఇవ్వడం జరిగిందన్నారు. యూనియన్ యజమానులు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద ఆరుసార్లు చర్చలు జరిపిన ఇద్దరు యజమానులు మొండి వైఖరి వల్ల చర్చలు నిలిచిపోయాయన్నారు. జిల్లా అధికారులు కలుగజేసుకొని వెంటనే పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. లేనిచో సమ్మె పోరాటం చేపడుతామని తెలిపారు. సిఐటియు 10వ జిల్లా మహాసభలు సందర్భంగా డిసెంబరు 13 స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రాయగడరోడ్‌లో రైస్ మిల్లు వరకు జరిగే కార్మిక ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ యజమానులు, లేబర్ అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఆరు నెలల పాటు కాలక్షేపం చేశారని రైతులకు ధాన్యం సీజన్ ప్రారంభమైతుందున సమస్య పరిష్కారం చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కళాశీల కూలీరేట్లు వందశాతం పెంచాలని, రెండేళ్ల ఒప్పందం చేయాలని యజమానుల మొండి వైఖరి విడనాడాలని కోరారు. యజమానులు, అధికారులు స్పందించి డిసెంబర్ 16లోపు ఒప్పందం చేయనిచో సమ్మె చేపట్టి మిల్లు వద్ద పనులు ఆపడం జరుగుతుందని, కార్మికుల జనరల్ బాడీ సమ్మె నిర్ణయాన్ని యజమానులకు నోటీసు ద్వారా తెలియజేశామని తెలిపారు. ఈలోపు చర్చించి పరిష్కారం కానిచో పోరాటం ఉధృతం చేస్తామని యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో 8 రైస్ మిల్లుల కళాసీలు, కమిటీ నాయకులు పి.లక్ష్మణరావు, సంగం, గోపాలం, బంటు ఆదినారాయణ, సత్యనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.సూరిబాబు, పలువురు మేస్త్రీలు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌తో నిమిత్తం లేకుండా ప్రెస్ క్లబ్ సభ్యత్వం కల్పిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ కన్వీనర్, సమాచారశాఖ పౌర సంబంధాల శాఖ ఎడి డి.రమేష్ తెలిపారు. ప్రెస్ క్లబ్ అడ్‌హాక్ కమిటీ సమావేశంలో గతంలో జరిగిన నిర్ణయం మేరకు సభ్యత్వం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు కలెక్టరేట్ లోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఎప్పటి నుంచి ఇక్కడ పని చేస్తున్నారు? తమ అనుభవానికి సంబంధించిన ధ్రువ పత్రాలు, గతంలో పొందిన అక్రిడిటేషన్ గుర్తింపు కార్డుల జిరాక్స్ ప్రతులు జత చేస్తూ ఒక ఫోటో కూడా దరఖాస్తుతో పాటు ఇవ్వాలని తెలిపారు. ఈ దరఖాస్తులపై తుది నిర్ణయం ప్రెస్ క్లబ్ తాత్కాలిక నిర్వహణ కమిటీదేనని పేర్కొన్నారు.

ఎడమ కాలువ బాధితుల సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోలవరం ఎడమ కాలువ భూబాధితుల సమస్యలను పరిష్కరించాలని పోరాట కన్వీనర్ చల్లా జగన్, రైతులు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు అల్లు జోగినాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబును కోరారు. శనివారం వారిని కలిసి సమస్యను విన్నవించారు. కాలువ కోసం భూసేకరణ చేస్తున్న అధికారులు వారి ఇష్టానుసారంగా మెలికలు తిప్పుకుంటూ వెళ్తున్నారని వివరించారు. అధికారులతో మాట్లాడి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జోగినాయుడు, నాయుడుబాబు హామీ ఇచ్చారు.

కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉగిరి ముత్యాలరావు

కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కష్టపడి పని చేసిన కార్యకర్తలను మండల అధ్యక్షులుగా అధిష్టానం నియమించిందన్నారు. జనసేన బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని కోరారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఎస్.గంగాధర్, రవి, సురేంద్ర, మహేష్‌ను అభినందించారు.

ఆర్‌ఎంపిల సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యాలరావు

ప్రజాశక్తి-వంగర

గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా సంగాం గ్రామానికి చెందిన ఉగిరి ముత్యాలరావు ఎన్నికయ్యారు. గ్రామీణ వైద్యుల సంఘం రాజాం డివిజన్ అధ్యక్షులు చౌదరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ముత్యాలరావును కలిసి సత్కరించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

విఆర్‌ఎ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలో పుర్లి గ్రామానికి చెందిన విఆర్‌ఎ కుప్పిలి ఎర్రయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబానికి శనివారం ఆర్‌ఐ ఉమాపట్నాయక్, విఆర్‌ఎ జె.కిరణ్ ప్రభుత్వం నుంచి దహన సంస్కారాల నిమిత్తం రూ.15 వేలు సాయం అందించారు. ఎర్రయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయాన్ని అందిస్తామని వారు తెలిపారు.

జగ్గుబాబుకు పలువురి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వేపాడ

జగ్గుబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపిపి సత్యవంతుడు

వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబుకు శనివారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

13న వాహనాల వేలం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆండ్ర ఎస్ఐ సిద్ధార్థకుమార్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో ఆటో, మూడు బైక్‌లకు వేలం వేస్తున్నట్లు చెప్పారు.

రామశేషు హంతకులను శిక్షించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం వైసిపి నాయకులు, వైస్ ఎంపిపి బరాటం రామశేషును హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పార్వతీపురం మన్యం జిల్లా కళింగవైశ్య సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. రామశేషు దారుణ హత్యకు నిరసనగా హత్య చేసిన హంతకుల్ని ఎంతటివారైనా పట్టుకొని కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబానికి ఇకపై ఎలాంటి హాని కలగకుండా భరోసా ఇవ్వాలని, శాంతి భద్రతలు పర్యవేక్షించి కాపాడాలని శనివారం పార్వతీపురంలో ర్యాలీ చేసి అనంతరం ఎఎస్‌పి దిలీప్‌కిరణ్‌కు వినతిపత్రం అందించారు. దీనికి ఎఎస్‌పి సానుకూలంగా స్పందించి ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో జరగకుండా పర్యవేక్షిస్తామని, ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో ఈ విషయంపై మాట్లాడతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైశ్య ప్రముఖులు అందరూ పాల్గొన్నారు.

కురుపాం : శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన కళింగ వైశ్య ప్రముఖుడు బరాటం రామ శేషును దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కురుపాం కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కెవి సురేష్ కుమార్, కళింగ వైశ్య సంఘం కురుపాం అధ్యక్షులు కె.రవీంద్రకుమార్, కళింగ వైశ్య సంఘ పెద్దలు, కలింగ వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపిని సాగనంపితేనే రాష్ట్రానికి విముక్తి

మాజీమంత్రి పతివాడ

భోగాపురం.. పోలిపల్లిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వ ప్రచార ఆర్భాటమే తప్ప చేసిందేమీ లేదని, అభివృద్ధిని గాలికొదిలేశారని మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు విమర్శించారు. వైసిపిని ఇంటికి సాగనంపితేనే రాష్ట్రానికి విముక్తి లభిస్తుందన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 14, 15 వార్డుల్లో ఇదేమీ కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరిట ప్రజలను మభ్యపెట్టి అభివృద్ధి పనులు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి పట్టిన కర్మ వైసిపిని వచ్చే ఎన్నికల్లో వదిలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ మాజీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయడు, లెంక అప్పల నాయుడు, కౌన్సిలర్ కల్యాణం సత్య నారాయణ, నాయకులు పొడుగు కృష్ణవేణి, నడిపేన నారాయణమూర్తి, నందం సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించలేని ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు అన్నారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలోని పోలిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పతివాడతోపాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి వైసిపి ప్రభుత్వం వల్ల ఏ ఉపయోగమూ లేదన్నారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి, భోగాపురం క్లస్టర్ ఇన్‌ఛార్జి దాసరి అప్పలస్వామి, పార్లమెంట్ మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి ఎల్లాజి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, పోలిపల్లి గ్రామ అధ్యక్షులు చింతపల్లి రామకృష్ణ, మామిడి బాలకృష్ణ, నాయకులు పిడుగు చందు, దారపురెడ్డి మధు, కనకల పైడినాయుడు, ఓదురి నరసింహులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి గ్రామాల్లో శనివారం టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను ఏ రకంగా మోసం చేస్తుందో ఆ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బటన్ నొక్కడం, పాత భవనాలకు రంగులు వేయడం, ఇసుకను దోచుకోవడం అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే మన ఆస్తులను కూడా దోచుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, ప్రధానకార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నాయకులు సేనాపతి గణేష్, సత్యం, చల్ల వెంకటరావు, వీలుపర్తి సర్పంచ్ శానాపతి లీల, శానాపతి అప్పారావు, జోగారావు, భూషణం, చప్ప దేవుడు, టి.రామకృష్ణ, వై.సూర్యం, బాలకృష్ణ, సిరికి రమణ, బోజింకి మహేష్ పాల్గొన్నారు.

వేపాడ.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

మానవహక్కుల పరిరక్షణకు కృషి

మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం డిఆర్‌ఒ వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం

మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్వతీపురం మన్యం డిఆర్‌ఒ జె.వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పేడాడ జనార్ధనరావు అధ్యక్షతధా సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరావు మాట్లాడారు. చట్టాలు కల్పించిన హక్కులను కాపాడుకోవాలన్నారు.

హక్కులు, విధులు.. నాణేనికి బొమ్మ, బొరుసు

శృంగవరపుకోట : హక్కులు, విధులు ఒకే నాణానికి ఉన్న బొమ్మ, బొరుసు లాంటివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బి.సంధ్యారాణి ఆధ్వర్యాన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ హక్కులతోపాటు విధులు కూడా బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవీంద్రనాథ్, శ్రీలక్ష్మి, శ్రీవలీఖాన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం కోట : ప్రతి ఒక్కరూ మానవ హక్కులను కాపాడాలని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు కొనియాడారు. శనివారం నారాయణ పబ్లిక్ స్కూల్లో 74 వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను హెచ్ ఆర్ డి అని అక్షర రూపంలో కూర్చున్న బెట్టి మానవ హక్కులను కాపాడుకుందాం అని విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేయించేశా. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరస్పాండెంట్ నారాయణరావు మాట్లాడారు.

హక్కుల కోసం పోరాడుతాం

మానవ హక్కులకు ఎక్కడ భంగం కలిగినా ముందుండి పోరాడుతామని ఉత్తరాంధ్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు సత్తి అచ్చిరెడ్డి అన్నారు. శనివారం 74 వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో ఎక్కడ ఏ మారుమూల ప్రాంతంలోనైనా మానవ హక్కులకు ఉల్లంఘన జరిగితే అక్కడికి వెళ్లి వారి తరపున వారి హక్కుల సాధనకై పోరాడుతామని తెలిపారు.

అంబేద్కర్‌కు నివాళి

వేపాడ : మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వల్లంపూడి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత మహాసభ మండల అధ్యక్షులు కొమనాపల్లి రాము, దళిత సేవ సేన జిల్లా అధ్యక్షులు కె.రవిప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమనాపల్లి ఏసుదాసు, గుత్తి శ్రీను, గుడివాడ శ్రీను, ఎఎస్‌పేట మాజీ సర్పంచ్ ఎం.అప్పలసూరి, గాడి రాజు, నున్న గోపాల్, రాజేష్ పాల్గొన్నారు.

వేపాడ.. అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తంచేస్తున్న ఎల్లాజీ కుటుంబ సభ్యులు

కొడుకును చంపేశారు.. న్యాయం చేయండి

ఎల్లాజీ తల్లి ఆవేదన

ప్రజాశక్తి -భోగాపురం

తన కొడుకును అన్యాయంగా చంపేశారని, తమకు న్యాయం చేయాలని వాసుపల్లి ఎల్లాజీ తల్లి ఎర్రయ్యమ్మ పోలీసులను కోరారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతోపాటు కుటుంబ సభ్యులు మాట్లాడారు. తమ స్వగ్రామం ముక్కాం అయినా, బతుకుదెరువు కోసం విశాఖపట్నంలో ఉంటున్నామని తెలిపారు. ఎల్లాజీ అమ్మమ్మ వారి ఊరు చేపలకంచేరు వెళ్లాడని తెలిపారు. గత నెల ఒకటో తేదిన రాత్రి ఆ గ్రామంలో కరెంటు నిలిపేసి, 17 మంది కత్తులతో దాడి చేశారని, ఇదే విషయాన్ని జిల్లా కేంద్రాస్పత్రిలో పోలీసులకు వెల్లడించాడని చెప్పారు. ఎల్లాజీ మృతి చెందిన రోజు మృతదేహాన్ని చేపలకంచేరు తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేస్తామని చెబితే వద్దని పోలీసులు ఆరోజు అడ్డుకున్నారని గుర్తుచేశారు. హత్య కేసులో ప్రమేయం ఉన్న అందరినీ అరెస్ట్ చేస్తామని చెప్పిన పోలీసులు ఇప్పటివరకు 8 మందిని మాత్రమే అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నెల రోజులు గడిచినా మిగతా వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లకా, లేక ఏదైనా ప్రలోభాలకు లోబడి పోలీసులు అన్యాయం చేస్తున్నారా? అని నిలదీశారు. పోలీసులను అడిగితే, ఎనిమిది మంది ప్రమేయమే ఉందని ఇప్పుడు చెబుతున్నారన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఎస్‌పిని కలిసి, నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

మాట్లాడుతున్న వెన్నె సన్యాసినాయుడు

ప్రజాశక్తి-గుర్ల

ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు డిమాండ్‌చేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పారదర్శకంగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటనలే తప్ప ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. గత వారంలో మండలంలో పలు ఆర్‌బికెల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించినా, ఇప్పటికీ గన్నీ బ్యాగులు రాలేదని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. కావాల్సిన వసతులు ఏర్పాటు చేయకుండా రైతుల నుండి ధాన్యం ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రైతుల నుండి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐటిడిపి సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగులపల్లి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో 'ఉపాధి నైపుణ్యం'పై సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం



సదస్సులో మాట్లాడుతున్న టిసిఎస్ డెలివరీ మేనేజర్ శేఖర్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉపాధి నైపుణ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టిసిఎస్ డెలివరీ మేనేజర్, డేటా ఎనలిస్టు శేఖర్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యంపై అవగాహన కల్పించేరు. ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే కమ్యూనికేషన్‌పై పట్టు సాధించాలని, సాఫ్ట్ వేర్‌కు సంబంధించిన ప్రోగ్రామింగ్ మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి సాధించేందుకు కావాల్సిన మెలకువలన్నీ నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామ్మూర్తి, హెచ్‌ఒడిలు , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ బికె రావు అవినాష్ పాల్గొన్నారు.

సొంతింటి కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి


పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అర్హత గల పేదలందరికీ సొంతింటి నిర్మాణ కల్పనే ప్రభుత్వ లక్ష్యమనిస్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాడంగి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇల్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, వైసిపి నాయకులు ఆవు సత్యనారాయణ ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

చైర్‌పర్సన్‌కు వినతి అందిస్తున్న వెంకటేశ్వరరావు

ఆర్‌టిసి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం కొండవెలగాడలో ఆర్‌టిసి రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మను కలిసి వినతి అందించారు. 15న జరిగే బోర్డు సమావేశంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావించాలని విజ్ఞప్తిచేశారు. బంగారమ్మ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

నేడు చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

విజయనగరంలోని బొత్స గురునాయుడు కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. బొబ్బిలి మండలం నుంచి రూరల్ విభాగంలో జ్యోతిబాపూలే, పట్టణ విభాగం నుంచి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల, ప్రయివేట్ పాఠశాల విభాగం నుంచి అభ్యుదయ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు హాజరవుతారని తెలిపారు.

మద్యంతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్‌షాపునకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ తెలిపారు. మండలంలోని నారాయణప్పవలస గ్రామానికి చెందిన కోనేటి చిననూకన్నదొర, కడుపుకూటి కృష్ణ బొబ్బిలి నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ ఫ్లైఓవర్ సమీపంలో పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరిని అరెస్టు చేసి, 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ చెప్పారు. అక్రమ మద్యం, నాటుసారా అమ్మకాలపై 9440902372 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడి చేసిన వారిలో ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది ఆదినారాయణ, సరస్వతి ఉన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ సంతోషికుమారి

'ఫ్యామిలీ డాక్టర్'తో అందుబాటులోకి వైద్య సేవలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామస్థాయిలో అందుబాటులోకి వైద్య సేవలు వచ్చాయని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి తెలిపారు. శనివారం పంచాయతీ పరిధిలో నాలుగో సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 104 వైద్యులు బి.రేణుకారాణి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో కొట్టాం పిహెచ్‌సి వైద్యులు ఎంజె హారిక, సిబ్బంది నూర్జాన్, శంకర్, సచివాలయ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోనాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కొనాలని ఎంపిపి ఇప్పిలి వెంకట నరసింహమ్మ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన నియోజకవర్గం స్థాయి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పని ప్రదేశంలోమహిళలపై లైగింక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షార్హులని తెలిపారు. మహిళలు అన్నింటా ముందుండి అభివృద్ధి చెందాలని అన్నారు. నిత్య జీవితంలో ఎదురైన సమస్యలను పట్టుదలతో ఎదుర్కొనాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, వలిరెడ్డి శ్రీనివాసరావు, గరివిడి, గుర్ల వైస్ ఎంపిపిలు, ఎపిఎంలు, మాట్లాడారు. కార్యక్రమంలో సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.